# అవి పట్టి చూపులు కావు!

సి. వి. హెచ్. సుబ్రహ్మణ్యం

ఇంట్లో అడుగువేస్తూనే తనభార్య సుశీల కట్టుకొన్న చీరెచిరుగు చూచాడు సూరి. ప్రశ్నించాడు.—

'చిరిగిన చీరె కట్టుకొన్నావేం?'

సుశీల వెంటనే చిరుగువంక చూచి అది కనబడకుండా మడిచివేస్తూ అంది — 'ఏం చెయ్యమంటారు? అన్ని చీరెలు చిరిగినై. క్రొత్తది తీసుకురండని ప్రతినెలా మీతో చెబుతూనే యున్నా....'

'ఏమి చెయ్యమంటావే సుశీ? నీకు తెలీనిదేముంది? ఏ నెలజీతం ఆ నెలలోనే అఖరవుతుండె. అప్పుచేయడానికి మనసొప్పదు. మనకయ్యే ఖర్చు నీవు చూస్తూనే యున్నావుగా!'

'అవునులెండి. మీరుమాత్రం ఏం చేయగలరు? అప్పూవద్దు, ఏమీవద్దు. ఇట్లాగే గడిచిపోతుంది.........'

'వచ్చేనెలలో ఏదోవిధంగా నీకో చీరె, నాకో ధోవతి ‌ంటానూ. నా ధోవతిగూడ చిరిగిపోయింది.........'

సుశీల వయస్సులో 16 ఏండ్ల యువకురాలైనా చాలయోగ్యురాలు. సంసారాన్ని ఏ విధంగా జరుపుకోవాలో ఆవిడకు బాగా తెలుసు. స్థితిని తెలిసికొని ప్రవర్తింపగల సాధ్వి. అగుట, సూరికి అట్టే కష్టం లేకుండా జీవితం గడిచిపోతున్నది.

సూరికి గుమాస్తాపని. 22 ఏండ్ల యువ్వనుడైనప్పటికి ఆఫీసులో బండచాకిరి చేయడంచేత శరీరమంతా కృశించిపోయింది. తలవెండ్రుకలు అక్కడక్కడ నెరిసినై. కళ్లు గుంటలుపడినై. మొఖం కోలదేరింద. మనిషి అస్థిపంజరంలా అయ్యాడు.

దేహమంతా ధారవోసి పగలంతా ఆఫీసుపనిలోనే మునిగిపోతున్నా, సూరి ఎంత జీతంలో ప్రవేశించాడో అంతే. కుటుంబంలో అభివృద్ధి అపుపించింది గాని జీతంలో సున్నా. కట కట లాడి పోతున్నాడు సంసారంతో. మొదట్లో— పెళ్ళాం, వకతే ఉన్న రోజుల్లో — రాజాలా వెలిగిపోయాడు. ఇప్పుడో? — రంగే బదలాయించాడు. ముగ్గురు పిల్లలు, ధోవతి మాసి, చిరిగిపోతే ఇంకోధోవతికి అతీ, గతీలేదు. క్రొత్తది కొనాలని నెలరోజులనుంచి ప్రయత్నం. పైసాయేది?—రాబోయే జీతానికి బడ్జటు తయారైంది.

రోజులు లెక్కవేసికొనగా జీతం దొరికింది. ఇక ఆ రోజు పరమానందం—నెలపొడుగూతా సంతోషమనేది లేకుండా, దరిద్రదేవత నెత్తిమీద తాండవిస్తుంటే, బానిసదేవత ప్రాణంపీల్చి పిప్పి చేస్తుంటే, రెంటికీ తలయొగ్గి, ఆఫీసులో అయ్యవార్లకు సలాములు కొడుతూయుండే గుమాస్తాకి ఒకటో తేదీకంటె సంతోషకరమైన దినం మరేముంది?—లక్ష్మి ప్రసన్నమై, గుమాస్తాని ప్రసన్నవదనుణ్ణి చేసే పండుగదినం గుమాస్తా కదా కటే గదా!

ఆ నెలలో అయిన ఖర్చులకుగాను ఇవ్వవలసిన పైకం కొంత ఇచ్చివేయగా, కొంత మినహాయించుకొనగా, ఒక ధోవతి కొనడానికి యజ్ఞం చేసినంత పనైంది సూరికి. పూర్వం ఎన్నో సూట్లు కుట్టించాడు. కాని ఇసుమంతగూడ శ్రమ అనిపించలేదు. ఇప్పుడు ఒక ధోవతి కొనాలంటే పరమేశ్వరుడు తలపుకొచ్చాడతనికి.

ఇంట్లోకి వెళుతూనే సంచిలోనుంచి రెండు బిస్కటు పొట్లాలు తీసి, సంచిని గోడనున్న మేకుకు తగిలించాడు. పిల్లలిద్దరికి చెరొక పొట్లాం చేతికిచ్చాడు. వాళ్ళను చంకన వేసికొని ఆటలాడుకొంటుండగా భార్య వంటింటోనుంచి వచ్చింది—

'ఏమండి నా చీరేది?'

"..................."

"మాట్లాడరేం?"

సూరి, పిల్లల్ని క్రింద దింపి, చొక్కా విప్పుతూ— బళి."

"తీసుకరాలేదు

"ఎందుకండి అసుద్ధాలు? సంచీ ఏది?...."


అన్ని హవాలకు, అన్ని సమయాలకు
దగ్గులకు మరియు పడిశెములకు
ROCHE
For COUGHS COLDS
సిరోలిన్ 'రోచ్'ని నమ్మండి
ప్రపంచములో అన్ని జాగలలో వాడుదురు

"నిజంగా సుశీ, తీసుకరాలేదు."

మేకునున్న సంచి చూచింది సుశీల. గబగబా ఆ సంచిని తీసికొని.

"నిజంగా తీసుకరాలేదు గదూ!....ఈ సంచి నాది...." సూరి లజ్జావదనుడై.

"అందులో ఏమీలేదు. నేను కొనుక్కున్న ధోవతిమాత్రముంది"

సుశీల సంచిలో చూచేవరకు భర్తమాట నమ్మలేదు. అంతా ఎగతాళి అనుకొంది. సంచిలో ఒక ధోవతిమాత్రం ప్రత్యక్షమయ్యేసరికి ఆవిడ కెక్కడలేని ఆగ్రహం వచ్చింది.

అందులో ధోవతి లేకపోయినట్లయితే అంత కోపం వచ్చేదికాదేమో! ఆవేశంతో అడిగింది 'జీతమంతా ఏంచేశారు?'

సూరి ఏం చెబుతాడు? చెప్పాలంటే చెప్ప గలడు. నోటనుండి మాటవస్తేగా!—వంగిన తల మీద చేతులువాల్చి ఖిన్నుడై కూర్చొనియున్నాడు.

ఇంతట్లో బైటనుండి కేకలు........

ఇంటి అద్దెవాడు—కోమటివాడు—మజ్జిగది—పాలది—

సుశీల అంతా చూస్తూనేయుంది. సినిమాలోని స్వప్నంలాగా ఐదునిముషాలలో ఆవిడ ప్రశ్నకు సమాధానం వచ్చింది.

భర్తపై జాలి గలిగింది భార్యకు. ఆవిడ కోపమంతా జలరూపందాల్చి నేత్రాలనుండి బయల్వెడలింది. తనలోతాను సంతోషించింది — "ఈ సంసారాన్ని ఈయన గనుక ఈడుస్తున్నారు. ఇంకోరైనట్లయితే నన్నెన్నడో విడిచిపెట్టేవారేమో! అప్పుడు పిల్లలసంగతి ఏమయియుండేదో! ఇటువంటి భర్త దొరకడం నిజంగా నా అదృష్టం — నా మూలాన సిగరెట్లు, బీడీలుగూడ మానుకొన్నారు పాపం—నా చీరె చిరిగిపోతే పోయింది. ఇంటో యుండే దానినేగా—చిరిగిన ధోవతితో ఆఫీసు కెట్లా వెళ్తారాయన?—"

సూరికి ఏడుపు వచ్చింది—"కుటుంబాన్ని సంతోషపెట్టలేని జీవితమెందుకు?—ఉద్యోగం మాననా?—అది పోతే ఇంకేముంది?—ఆఖరికి కూలి, నాలిచేసికోవాలన్నా శరీరపటుత్వంలేదు—ఈ ఉద్యోగంతో అన్నీ నశించినై"—

భార్యాభర్తలు ఒక నిముషంసేపు ఒకరి నొకరు చూచుకొన్నారు. అవి వట్టి చూపులు గావు—

# ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము

బి. వి. రమణయ్య

ముప్ఫయి యేళ్ళ కిందటనే (కీర్తికాయులు) శ్రీ కొమర్రాజు లక్ష్మణరావు గారు మంచి పద్ధతులతో ఆంధ్ర విజ్ఞాన సర్వస్వాన్ని ఆరంభించి—ఇంచుమించుగా 'అ' కారాన్ని పూర్తిచేసి ప్రకటించారు

ఏ దుర్ముహూర్తాన ప్రారంభమైనదో గాని, అది ఆదిలోనే నిలిచిపోయింది. అదే కాలంలో ప్రారంభమైన మహారాష్ట్ర విజ్ఞాన సర్వస్వము ఎప్పుడో పూర్తయింది.

దేశోద్ధారక శ్రీ నాగేశ్వరరావు పంతులు గారు, శ్రీ లక్ష్మణరావుగారి సంకల్పాన్ని పూర్తిగా నెరవేర్చాలని తలచి, మొదట్నుంచి ప్రారంభించి రెండు సంపుటాలు మాత్రం ప్రకటించారు. లక్ష్మణరావుగారు ప్రకటించినది కూడా అంత వరకే. దానితో—అదీ మూలపడిపోయింది.

విద్యాశాఖామంత్రిగారి అభిమాన మూలకంగా అరవానికి ఒక విజ్ఞాన సర్వస్వం వెలువడే సందర్భంలో ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం సంగతికూడా తలపునకు తేబడింది.

దీనికొక ఆలోచనాసంఘంకూడా ఏర్పడినది యీ మధ్యనే!

శ్రీ నాగేశ్వరరావుగారు తలపెట్టిన పని వారి జామాతలు పూర్తిచేస్తారని వినికిడి. అలాంటప్పుడు యీ సంఘంవారు వారితో సంప్రతించి, ఒక నిర్ణయానికి వచ్చి ఎప్పటికన్నా విజ్ఞాన సర్వస్వం పూర్తిగా వెలువడే మార్గం ఆలోచించాలి.

'విజ్ఞాన సర్వస్వం' లో పనిచేసిన వారూ, దానికి విషయాలు ఇచ్చినవారూ, వ్యాసాలు రాసినవారూ వున్నారు కాబట్టి—ఇందులో వారి సలహాలనూ, సహాకారమునూ తీసుకోవడం ముఖ్యం.

ఆయా విషయాల్లో ఆరితేరినవారిని సర్వస్వ గ్రథనానికి నియమించాలి.

అలా చెయ్యకపోతే—ఇంతవరకూ ఒక పద్ధతి అంటూ ఏర్పడని తమిళ విజ్ఞాన సర్వస్వము అనుకున్న కాలంలో తయారవడమూ, ఇదివరకే ఒక పథము ఏర్పడి, కొంతపని సాగిన 'ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం' అసమగ్రంగా వుండిపోవడమో, లేక ఆభాసంగా పూర్తికావడమో మాత్రం జరుగుతుంది.